స్కెచ్

# చిన్ననాటి శ్రీదేవి

"మంజుశ్రీ"

అమ్మమ్మగారి వూరికి పోవటానికి కారణం ఏమిటని చెప్పటమంటే,—అమ్మమ్మ పెద్దదయింది, ఎలా ఉందో చూడాలి. తర్వాత మామయ్యగారి పుల్లావు కోడెదూడ నీనిందట చూసిరావాలి—యిట్లా చెప్పేవాణ్ణి. అసలు సంగతేమిటంటే, మా మరదలుతోటి గవ్వలాటా, అట్లాచెమ్మా, వామనగుంతలు ఆడుకోవచ్చు. సంక్రాంతిసెలవలకుపోతే సగం పండిన మిరప తోటలు, అక్కడక్కడ బంతిపూలు, చక్కగా ఉంటాయి. అమ్మమ్మనడిగి అన్నం కట్టించుకొని మరదలుతోటి చేలకు పోవటం మొదలైనవి అసలు కారణాలు.

ఎప్పుడు పడితే అప్పుడు పోయే వూరుకాదు. ఎటు చూచినా పదిమైళ్ళలోపున రోడ్డేలేదు. అయినా ప్రతిసంక్రాంతి సెలవలకు తప్పకుండా పోతూవుంటాను.

ఇప్పుడైతే చొక్కాకాలరు పట్టుకొని మూడు గంటలసేపు ముచ్చట్లు చెపుతుందిగాని, మరదలు అప్పుడు పోయినరోజల్లా మాట్లాడేదేకాదు. ఎలా పలకరించటమా అని మాయిద్దరికీ సమస్యే. అత్తయ్యా వాళ్ళూ నవ్వుకునేవారు. వాళ్లేమిటో చెప్పుకొని నవ్వుతుంటే యీవిడకు కోపం.

స్కూలుఫైనలు చదువుతుండగా పరీక్షల భయంకూడా లేకుండా అమ్మమ్మగారి వూరి కెళ్ళాను. మామయ్యడిగిన వాటన్నిటికీ తలవంచు కొని సమాధానంచెప్పి (భయం ఎందుకో) పడమటింట్లోకి చూశాను. శ్రీదేవి మొహం చాటంతయింది.

అమ్మమ్మొచ్చి అమ్మ గొలుసు చేయించుకోవటం దగ్గిర్నుంచి, కొత్తచీరలు కొనుక్కున్న విషయం దాకా అడిగి తెల్సుకుంది.

కాఫీగ్లాసొచ్చి పదిగజాల దూరంలో నేలమీద నిలబడ్డది. అమ్మమ్మ 'అదుగో కాఫీ' అంది. 'ఎవరికీ' అన్నాను నేను. శ్రీదేవి చురచుర చూసింది.

"నాకైతే చెప్పిన గంటన్నరకు 'పాలు బాగా లేవు బామ్మా'అని సమాధానం వచ్చేది. నీక్కాబట్టే పదినిముషాల్లో వచ్చేయి" అంది అమ్మమ్మ. మామయ్యక్కడలేడు. ఏటో పనిమీద వెళ్ళిపోయాడు. (అందుకే మనకింత ధైర్యం.)

శ్రీదేవి చరచర, విసవిస, రుసరుస లాడుతూ వెళ్ళిపోయింది. అమ్మమ్మ గాంధీగారిలా (పళ్లులేవు) నవ్వింది.

"ఇంకా ఏమిటిరా సంగతులు. బాగా చదువుకుంటున్నావా? స్నానం చేద్దువుగాని రా"అంటూ అమ్మమ్మ లోపలకు తీసుకెళ్ళింది.

ఎలా పలకరించాలి, ముందేమని మాట్లాడాలి అని నేను మథనపడతాను. శ్రీదేవి నావైపు, నేను తనవైపు చూసిందాకా చూస్తుంది. నే చూస్తే తను పెద్దపనిలో మునిగివున్నట్లుగా నావైపు చూడనైనా చూడదు. ఆరోజల్లా అంతే. ఇక తరవాత తరవాత, గవ్వలు పట్టుకొనివస్తే ఎదురింటి సుబ్బమ్మగారింట్లో కావాలసినంత చర్చ.

ఆ మరునాడు గాబుదగ్గరికెళ్ళి కాళ్లు కడుక్కుంటూ, తోట్లనిండా విరగబూసిన చామంతి పూలుచూస్తూ నిలబడ్డాను. అమ్మమ్మా, అత్తయ్యా వంటయింట్లోవున్నారు. శ్రీదేవి దగ్గరకొచ్చి నిలబడ్డది. ఎలాగోలాగ సంభాషణ మొదలెడితే తరవాత అవధుల్లేకుండా సాగిపోతుంది. అవసరమా, అనవసరమా యీ మాటలన్న తలపే వుండదు.

"ఈ వూళ్ళో ఒక పిచ్చివాడున్నాడు తెలుసా?"అని అడిగింది శ్రీదేవి. నాకు తెలియదని తనకు బాగా తెలుసు. అయినా ఏదో మాటాడాలి కాబట్టి అంది.

"ఈ వూళ్ళో ఒకపిచ్చి అమ్మాయి వుంది నీకు తెలుసా?"అన్నానునేను. శ్రీదేవికి ఉక్రోషంవచ్చింది.

"మరే, ఆ పిచ్చాడు నిన్నటిదాకా లేడు. నిన్న పొద్దున్నే సంచిపట్టుకొని, బూట్లు తొడుక్కొని వచ్చాడు"అంది శ్రీదేవి.

"ఆ పిచ్చమ్మాయే, ఆ పిచ్చాణ్ణి చూడటానికే మరే పడమటింటి కిటికీలోనించి తొంగితొంగి చూసింది."

"ఆ పిచ్చబ్బాయికి గుమ్మడి కాయలాంటి ముక్కు."

"ఆ పిచ్చమ్మాయికి, నా మూరంత జడా, నా అరచేతులంత కళ్ళూ..."

"అమ్మా చూడవే. మరీనూ..." రాగాలాపన మొదలెట్టింది శ్రీదేవి.

చల్లగా జారుకున్నాను. వంట యింట్లోంచి అత్తయ్య, "అప్పుడే మొదలెట్టారూ"అంటున్నది.

భోజనాలయిపోయిన తర్వాత అమ్మమ్మా అత్తయ్యా నిద్రపోతారు. నాయనా ఆ నిద్ర యెట్లా పడుతుందో బ్రహ్మదేవుడికూడా తెలియదు. మామయ్య నిద్రపోవటం చూస్తేనే నాకు భయం. చిన్నతనంలో రాత్రిళ్లు మామయ్య గురకకు హడిలిపోయేవాణ్ణి. శ్రీదేవి నేను లేనప్పుడు మధ్యాహ్నమంతా ఏంచేస్తుందో అనుకునేవాణ్ణి. ఆపక్కింటివాళ్ళింట్లోనో, ఈపక్కింటివాళ్ళింట్లోనో వామనగిల్ల లాడటానికి పోతుందిగామోసు.

మామయ్య గట్టిగా నిద్రపోవటంచూసి, శ్రీ, చుక్క, వొకటీ రెండూ, మంచినీళ్ళూ అన్నాను.

మంచినీళ్ళు నోటిదగ్గర పెట్టుకొని "గవ్వలు తేవూ" అన్నాను.

"ఛో ఛో...నీతోటి నే నాడను. తొండిచేసి ప్రతి ఆటా నీవే గెలుస్తావు. నే రాను."

"ఛాఛా..ఇంక ప్రతి ఆటా నిన్నే గెలిపిస్తాగా తీసుకురా...తీసుకరా...ఎక్కడకూచుందాం?"

"చదువుకోరాదూ?"

"నీకూడా యీ పిచ్చి పుట్టింది! నాల్రోజులొచ్చి వుందామన్నా పాడుచదువు, వదిలిపెట్టనియ్యావే ఛో...అయితే నిన్ను చేసుకోను."

"పాపం! నిన్ను చేసుకుందామనే నేను కాచుకూచున్నాను కాబోలు. ఎంతఆశ!" అంది శ్రీదేవి.

"అయితే నన్ను చేసుకోవన్నమాట?"

"మరి నన్ను పిచ్చామ్మాయని ఎందుకన్నావు?"

"నన్ను పిచ్చాడికింద జమకట్టవచ్చు కాబోలు?"

"నేనట్లా అన్నానా బావా? ఈ వూళ్ళో పిచ్చాడున్నాడు అన్నాను. లేదేంమరి? రేపు పడమర చేనుకు పోయేటప్పుడు చూపిస్తానుండు నామాట అబద్ధమైతే! పడిముందు కూచోని మీసాలు మెలేసుకుంటుంటాడు. ఈమధ్య నాన్న పొలంనుంచి వస్తుంటే మీసం మెలేసి 'నామీది కొస్తావా?'అన్నాట్ట!" శ్రీదేవి చెప్తున్నది.

"మరి నాకేం తెలుసూ? చెంపలేసుకుంటున్నానే, సత్యభామా!"

"అదుగో అదేవద్దంది. ఈసారి మంచినీళ్ళడుగు చెబుతా!"

కష్టపడి గ్లాసెడు మంచినీళ్ళు గటగట తాగేశాను. శ్రీదేవి కొకటే నవ్వు. మామయ్య లేస్తాడేమోనని నా భయం. నిద్రాభంగమయితే, శివుడు మూడోనేత్రం తెరిచినట్టే; భలే కోపం ఆయనకు.

ఆ మర్నాడు ప్రొద్దుట అన్నం కట్టుకొని చేనుకు పోతూ, రావిచెట్టుకింద చూసి "వాడేడీ?" అన్నాను శ్రీదేవితో.

"ఊళ్ళో కెళ్ళాడేమో! అడుక్కోవటానికి. ఆ కుక్క వాడిదే!" అంది శ్రీదేవి.

"ఏవూరు వాడిది?"అన్నాను నేను.

"పాలెంలేదూ, ఆ వూరివాడు. మొదట బాగానే పనిచేసుకొని బ్రతుకుతుండేవాడు. పాలెం కరణంగారింట్లో జీతగాడుగా పనిచేసేవాడు."

"మరెందుకు పిచ్చెక్కింది?"

"వాడిభార్య మందు పెట్టించింది."

"ఎందుకూ?"

"ఎహే, ఛో... నే చెప్పను పో"

"చెప్పవా?"

"ఇంకోర్ని పెళ్ళిచేసుకుందామని, వాడిచేత మందు పెట్టించింది. వీడికి తెలీక ఆ మందుతిని, వాడితోటు పోట్లాడి, వాడున్నూ, అదీకలిసి చంపటానికి ప్రయత్నిస్తే పరిగెత్తుకొచ్చాడు. వాళ్ళిద్దరూ ఎటో పోయారట."

"నీ కెవరు చెప్పారు?"

"ఇంట్లో జీతగాళ్లు అనుకుంటుంటే విన్నాను."

శ్రీదేవీ నేనూ చింతచెట్టుకింద కుంటపక్క కూచుంటే, భోజనం చేసేటప్పుడు నా ఆకు వేరే వెయ్యమంది.

అట్లా వీలులేదన్నాను నేను.

"నేన్నీదగ్గర తినను," అంది శ్రీదేవి.

"అయితేనేను నీదగ్గిర తింటాలే"అన్నానునేను.

శ్రీదేవి వాకిటే నవ్వింది. చూడకుండా ఆవ కాయముక్క కొరికి నోట్లో పెట్టాను. ముక్క కిందపడకుండా, థూ, అన్నది.

మళ్ళీవచ్చేటప్పుడు, రావిచెట్టుకింద, గిన్నెలో అన్నం తింటున్నాడు వాడు. కుక్క కూడా గిన్నెలో మూతిపెట్టి తింటున్నది.

ఎడంచేత మీసం మెలేస్తూ "ఎవడురా నా మీది కొచ్చేది?" అంటున్నాడు వాడు. నావైపు అదోలా చూశాడు.

శ్రీదేవి చేయి గట్టిగా పట్టుకున్నాను.

శ్రీదేవి మొహాన్ని నవ్వువెల్లువ ముంచేసింది.

---

బ్రతుకు తెరువులో

# ఉపాసించ దగిన కళ

## మధిర భానుమూర్తి

ఎవరి దగ్గిరకేనా వెళ్ళి ఆయనను గురించే ఆయనతో మాట్లాడడం చాలా కష్టమయిన పని. ప్రపంచంలో ఉన్న విషయాలన్నీ చాలా కులాసాగా చర్చించిన మనం ఆయన విషయమే ఆయనతో మాట్లాడవలసి వచ్చేసరికి ఒక్కసారి తగ్గవలసి వస్తుంది. ప్రత్యక్షంగా మనముందున్న వ్యక్తితో ముఖాముఖిని ఆవ్యక్తినిగురించే మాట్లాడ టానికి మనకు ధైర్యంచాలదు. మానవుడు ఎన్నో క్లిష్టసమస్యలను సునాయాసంగా పరిష్కరించ వచ్చు, ఎన్నో అత్యద్భుత విషయాలను సాధించ వచ్చు, ఎన్నో అవాంతరాలను అవలీలగా దాట వచ్చును గాని ఈ సందర్భాన్ని ఎదుర్కోవలసి వస్తే అంతవాడూ ధైర్యం జారిపోయి చేతకాని వాడవుతాడు. మాట్లాడటానికే ఇంత ఇది ఉంటే ఆవ్యక్తిని ముఖంమీద ప్రశంసించవలసివస్తే ఇంకా ఎంత అవస్థపడవలసి వస్తుందో తేలికగా ఊహించ వచ్చు.

అసలు దీని ప్రయోజనమేమిటి?...మానవుడికి సహజంగా పొగడ్తలకి లొంగే గుణంఉంది గనక దాన్ని ఆధారంగా చేసుకుని మనకు అవసరమైన పని వచ్చినప్పుడు ఆపని చెయ్యగల వ్యక్తిని నాలుగు మాటలతో ప్రశంసించి మనపని చేయిం చుకోవచ్చును. ఈ పొగడ్తలకి లొంగే వ్యక్తిలో "నలుగురి చేతా ఇలాగ పొగిడించుకోవాలి." అనే తృష్ణఉంటుంది కనుక ఇతరులు పలికే ప్రశంసా వాక్యాలతో ఈ తృష్ణఅణిగి, అతడు సంతృప్తుడై, ఆ శుభసమయంలో వెంటనే నీకు ఏపని కావలసినా చేస్తాడు. అయితే ఆవ్యక్తి ఆరకం తృష్ణలేని వాడయితే నీ ఆటలు సాగవు. అలాంటి వాడిని నువ్వు ఎంతగా స్తుతించినా నీకు వచ్చే ప్రతిఫలం ఏమీఉండదు సరిగదా ఒక్కొక్కసారి నీకు అపకారంకూడా జరుగవచ్చు. కనక ఈ విష యంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆ వ్యక్తిని గురించిన ఆచూకీ నీకు బాగా తెలిస్తేనేగాని నువ్వు అలాంటి సాహసకృత్యానికి దిగకూడదు.

సరే!...ఆవ్యక్తి ముఖస్తుతులంటే మురిసిపోతా డని విన్నావు. అంతటితో నీపని తేలికయి పోయిందా?...అసలు చిక్కంతా ఇక్కడేఉంది. అతడు ఎంత చేటు ముఖస్తుతులకి లొంగే మనిష యినా "నా ఎదురుగావచ్చి నన్ను స్తుతించండి చాలు—నేను మీకందరికీ ఎవరెవరికి ఏ ఏ పనులు కావలసినా చేసిపెడతాను — అవి సత్కార్యా లైనా సరే! అఘాయిత్యాలైనా సరే!—ఏటొచ్చీ నాకు కావలసింది ముఖస్తుతేసుమండీ!" అని పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డుకడతాడా?...కాక, వచ్చిన వాళ్ళందరికీ చెప్తాడా?...ఏమీ చెయ్య డుగా!...అంతేకాదు. నువ్వు స్తుతిస్తూంటే అతగాడి అంతరాత్మలో ఎంతో తృప్తికలిగినప్పటికీ పైకి